# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

**SEPTEMBER 2007**

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2007 ఆగష్టు మొదటి తేదీ నాటికి రిక్కీగూటం దంపతులు అమెరికా దేశ పర్యటన ముగించుకొని దేవుని దయవలన క్షేమముగా కాకినాడ చేరుకొనిరి, అమెరికాలో ఆ దంపతులిరువరకు పలుచోట్ల ఘన స్వాగతం లభించినది.

ఆగష్టు 11వ తేదీ శనివారం పశ్చిమగోదావరి జిల్లా కోయలగూడెంలో జరిగిన సువార్త సుత్తి కూటములో రిక్కీ, సుదీప గూటంగార్లు హాజరై వాక్యపరిచర్య చేసిరి. సోదరులు వి. సుదర్శనరావుగారు కూడ సతీసమేతముగా ఆ కూటమునకు హాజరై చక్కటి వాక్య పరిచర్యగావించిరి. కోయలగూడెంలో సోదరులు G.D.V.K. ప్రసాద్‌గారు సువార్త చాటుచున్నారు.

ఆగష్టు 14వ తేదీ మంగళవారం అమలాపురం కరక్కాయ పేటలో జరిగిన సుత్తి, కృతజ్ఞత కూటములో జాషువా గూటంగారు సతీసమేతముగా హాజరై వాక్య పరిచర్యగావించిరి. కరక్కాయ పేటలో బూల రవిశాస్త్రిగారు క్రీస్తు సువార్తను చాటుచున్నారు.

ఆగష్టు 15వ తేదీ బుధవారం కొత్తపేటమండలం వీధివారి లంకలో చక్కటి సువార్త కూటము నిర్వహించబడగా అనేకులు హాజరైరి. రిక్కీ గూటంగారు మంచి వాక్యపరిచర్యచేయగా 7 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వీధివారిలంకలో సోదరులు దేవిడ్ రాజుగారు నమ్మకమైన సువార్త చాటుచు ఆత్మలను రక్షించుచు,సంఘక్షేమాభివృద్ధికి పాటుపడుచున్నారు. వీధివారిలంకలో రిక్కీగారి తాతగారైన కీర్తిశేషులు అప్పారావు గూటంగారు 40 సంవత్సరముల క్రితమే క్రీస్తు సంఘమును స్థాపించిరి.

ఆగష్టు 21వ తేదీ మంగళవారం రాజమండ్రి సారంగధర మెట్టలో సోదరులు కొండబాబుగారి ఆధ్వర్యమున ఏర్పాటు చేయబడిన కూటమునకు రిక్కీ గూటం దంపతులు హాజరై వాక్యపరిచర్యలో పాలుపొందిరి. సోదరులు

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH



P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**



*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | సెప్టెంబర్ 2007 | సంచిక 2


## దేవుడు ప్రేమా స్వరూపి

(God is Love)

యోహాను వ్రాసిన మొదటి పత్రిక నాలుగవ అధ్యాయములో ఈలాగు వ్రాయబడియున్నది. "ప్రియులారా మనము ఒకని నొకడు ప్రేమింతము. ఏలయనగా ప్రేమ దేవుని మూలముగా కలుగుచున్నది: ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగా పుట్టినవాడై దేవుని నెరుగును. దేవుడు ప్రేమా స్వరూపి. ప్రేమ లేని వాడు దేవుని నెరుగడు. మనము ఆయన ద్వారా జీవించునట్లు దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను: దీనివలన దేవుడు మన యందుంచిన ప్రేమ ప్రత్యక్ష పరచబడెను" (1 యోహాను 4:7-9).

దేవుడు ప్రేమయై యున్నాడని బైబిలు బోధించుచున్నది. దేవుని లక్షణము లన్నిటిలో ప్రేమ గొప్పది. దేవుడు ప్రేమా స్వరూపి యని చెప్పగా కొందరు అట్లయితే ఈ లోకములో ఎందువలన గొప్ప అన్యాయము,

అక్రమము ప్రబలియున్నదని ప్రశ్నింతురు. ప్రకృతిలో క్రూరత్వమును కనుబరచు లక్షణములున్నవని నేను అంగీకరించుచున్నాను. కరువులు, కాటకములు, వరదలు, తుఫానులు, వ్యాధులు. బాధలు, భూకంపములు మొ॥నవి అన్నియు ప్రకృతిలో యున్న బీభత్సవమును బయలుపరచుచున్నవి. అయితే ఇట్టి వాటిని బట్టి మనము దేవుని ప్రేమను మరువరాదు.

దేవుని ప్రేమను కనుబరచు అనేక సంగతులు మనచుట్టూ యున్నవి. గొప్ప గొప్ప పర్వతములు, సారవంతమైన లోయలు, ముడి పదార్థములతో నిండియున్న స్థలములు, పక్షుల పాటలు, సమృద్ధిగా పండే పంటలు, సుందర సూర్యోదయము, అంతకన్నా సుందరమైన సూర్యాస్తమయము, అడవులు, అందముగా అలంకరింపబడిన వృక్షములు, మనశ్శాంతి నిచ్చు సముద్ర, నదీతీరములు మొ॥నవి ఎన్నియో దేవుని ప్రేమను మనకు ప్రకటించుచున్నవి.

దేవతార్చనలను, విగ్రహారాధనను ప్రోత్సహించు మతములన్నియు దేవుడు రౌద్రుడని, శపించువాడని భయపడుదురు. అట్టి రౌద్రుని కోపము రవులుకొనకుండ వారు తమ శరీరములను తామే గాయపరచుకొందురు. అట్టి అబద్ధ దేవుండ్లను సేవించువారు ముండ్లపై కూర్చుందురు. వారి శరీరములను కోసికొందురు. చీకటి బిలములలోయుండి తపస్సు చేతురు. నిప్పులపై నడిచెదరు. ఒక్కొక్కసారి తమ పిల్లలను బలియిత్తురు. ఇట్టి వాటి నన్నిటిని వారు చేతురు. ఇట్టి విధముగా తమ్మును తాము శిక్షించు కొనుటలో తమ యిష్టదైవము యొక్క కోపము ఉపశమనమగునని వారి యభిప్రాయము.

అయితే దేవుడు పౌరుషము గలవాడైనను ఆయన ప్రేమించు దేవుడై యున్నాడని బైబిలు దేవుని గూర్చి మనకు విశదముగ బోధించుచున్నది. "శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను" అని యిర్మియా 31:3లో దేవుడు ప్రకటించెను. ఇంతగొప్ప మాటను, ఆశ్చర్యకరమైన సంగతిని మానవుడెన్నడు యిది వరలో విననే లేదు. ప్రకృతిలో గాని, తత్వ

సిద్ధాంతాములలో గాని మానవుడు. దేనినైతే కనుగొన లేకపోయెనో దానిని దేవుడే ప్రకటించెను: "శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను". మనము దేవుని వెదకి నందు వలన, దేవుడు మనలను ప్రేమించు చున్నాడని బైబిలుబోధించుట లేదు. అట్లుకాదు గాని, దేవుడే మానవుని వెదికెను. "మన ప్రభువైన యేసుక్రీస్తు మనలను ప్రేమించి, కృప చేత నిత్యమైన ఆదరణయు, శుభ నిరీక్షణయు అనుగ్రహించిన మన తండ్రియైన దేవుడును మీ హృదయములను ఆదరించును" అని 2 థెస్స 2:16లో వ్రాయబడి యున్నది. "ఈ దేవుడు సదా కాలము మనకు దేవుడైయున్నాడు. మరణము వరకు ఆయన మనలను నడిపించును" అని కీర్తన 48:14 చెప్పుచున్నది.

దేవుని ప్రేమను మనము అర్థముచేసికొనవలెనంటే, తన కుమారుని మనకొరకు అర్పించుటలో గల గొప్ప త్యాగమును గ్రహించు కొనవలెను. లేని యెడల మన ప్రయత్నములన్నియు వ్యర్థమే. బైబిలులోని బంగారు వాక్యమని చెప్పబడు యోహాను 3:16 ఇట్లు చెపుచున్నది: "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవమును పొందునట్లు ఆయనను అనుగ్రహించెను". 17వ వచనము కూడ చాల ప్రాముఖ్యమైనది. అది యిట్లు చెప్పుచున్నది: "లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు.

ఈ వచనములో అనేక గొప్ప సంగతులు మనకు కన్పించుచున్నవి. మొదట-దేవుడు లోకమును ప్రేమించెను. దేవుడు లోకమును ఎంతో ప్రేమించి ఏమి చేసెను? ఆ ప్రేమను ఆయన సీనాయి నుండి యెరూషలేము వరకు, యెరూషలేము నుండి భూ దిగంతముల వరకు ప్రకటించెను! అంతేకాదు ఆయన ప్రేమించి,

ప్రకటించుటయేగాక,ఆయన తన కుమారుని యిచ్చెను. దేవుడు తన ప్రేమను ప్రకటిస్తూ తళతళలాడు ముత్యముల నీయలేదు. ముత్యములను అంతకన్నా శ్రేష్టమైన వాటిని ఆయన మానవులకు ముందే యిచ్చెను. అయితే దేవుడు లోకమును ప్రేమించి తన కుమారుని బలియిచ్చెను. ఆయనకున్న అనేక కుమారులలో ఒక కుమారుని కాదుగాని, ఆయనకున్న ఒకేఒక్క కుమారుని ఆయన బలి యిచ్చెను. దేవుడు తన ఏకైక కుమారుని మానవునిగా ఈ లోకమున కర్పించెను.ఆయన మానవుని వలె జన్మించి పొత్తి గుడ్డలతో చుట్టబడి, పశుల తొట్టెలో పరుండ బెట్టబడెను. బహుదీనునిగా జన్మించి ఒక యౌవనునిగా నజరేతులో పెరిగెను. "యేసు జ్ఞానమందును వయస్సు నందును, దేవుని దయ యందును, మనష్యుల దయ యందును వర్థిల్లుచు పెరిగెను" (లూకా 2:52).

యేసుకు 30వ సంవత్సరము వచ్చునరికి ఆయన యొర్దానులో బాప్తిస్మము పొందెను. అటుతరువాత మూడు సంవత్సరములు సువార్త ప్రకటించెను. ప్రజలకు దేవుని గూర్చి బోధించెను. రోగులను స్వస్థపరచెను: గ్రుడ్డివారికి చూపునను గ్రహించెను. కుంటివారికి నడువ శక్తినిచ్చెను, దయ్యములను వెళ్ళగొట్టెను. చనిపోయిన వారిని లేవదీసెను. "తండ్రి కుమారుని ప్రేమించుచు తాను చేయు వాటి నెల్లను ఆయన కనుపరచుచున్నాడని" ఆయన బోధించెను (యోహాను 5:20). నన్ను చూచిన వాడు తండ్రిని చూచు చున్నాడని కూడ ఆయన బోధించెను. యేసు దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వయు యొక్క మూర్తి మంతమునై యుండెను అని హెబ్రీ 1:3లో వ్రాయబడి యున్నది. గనుక దేవుడు యేసుక్రీస్తు ద్వారా తన్నుతాను లోకమునకు బయలుపరచుకొనెను. క్రీస్తు ద్వారా ఆయన గొప్ప ప్రేమను ఈ లోకమునకు వెల్లడిపరచెను.

క్రీస్తు యొక్క జననములోను, సత్క్రియలలోను, సద్బోధలలోను దేవుని ప్రేమ మనకగు పడుచున్నను, క్రీస్తు యొక్క మరణములో దేవుని ప్రేమ యొక్క గంభీరతను మనము

చూడగలుగు చున్నాము. "మనము ఆయన ద్వారా జీవించునట్లు దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను: ఇందులో ప్రేమ యున్నది". "ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించు చున్నాము" అని భక్తుడైన యోహాను వ్రాసెను (1 యోహాను 4:9, 10,19).

మానవుని యెడల దేవుని ప్రేమ శాశ్వతమైనది, యదార్థమైనది యని నిరూపించుటకు గాను క్రీస్తు తన ప్రాణమును బలి యిచ్చెను. "మన యతిక్రమక్రియలను బట్టి అతడు నలుగ గొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది. మన మందరము గొర్రెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తన కిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మనయందరి దోషములను అతని మీద మోపెను". అని ప్రవక్తయైన యెషయా వ్రాసెను (యెషయా 53:5,6).

దేవుడు ప్రేమయై యున్నాడు. యేసుక్రీస్తు ద్వారా ఆ గొప్ప ప్రేమను మనకు చూపించి యున్నారు.. ఇప్పుడు మనమాయనను ప్రేమింపవలెనని ఆయన కోరుచున్నారు. మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు అని యేసు చెప్పుచున్నారు. ఆయన యందు సంపూర్ణ విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారు మనస్సునొంది. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుట ద్వారా ఆయన యిచ్చు ప్రాథమిక ఆజ్ఞలకు లోబడుము. అటు తరువాత మరణ పర్యంతము ఆయనకు నీవు నమ్మకముగా జీవించిన యెడల నిత్యజీవము అనే కిరీటాన్ని ఆయన నీకు బహూకరించును.

**క్రీస్తు సంఘములు సమర్పించుచున్న**
**సత్యవాణి కార్యక్రమములను**

ప్రతి శనివారం ఉదయం 6:30 గంటలకు తేజ ఛానల్‌లోను గురువారం ఉదయం 7 గంటలకు విస్సా ఛానల్‌లోను చూడండి.

# సంఘము యొక్క పని

## (Work of the Church)

సంఘము ఎందుకు ఉన్నది? దాని ప్రయోజన మేమి? దాని పని ఏమి ? వాటిని తెలిసికొనుటకు మనము దేవుని వాక్యమునొద్దకు వెళ్ళదము.

సంఘము ఈ లోకసంబంధమైన వ్యాపారములో లేదు అని గమనించవలెను. పాఠశాలలను, ఆసుపత్రులను నడిపించుట దాని పనికాదు. ధనార్జనకొరకు గ్రంధములను ప్రచురించి విక్రయించు వ్యాపారమునందు అది లేదు. ఈపనులన్నియును మంచివే. క్రైస్తవులు వ్యక్తిగతముగ వీటిని జరిగించు హక్కు కలిగినవారయినను, అవి మాత్రము సంఘము యొక్క పనికాదు. ఈనాటి క్రైస్తవ లోకము పైనుదహరింపబడిన పనులపై ఎక్కువ కేంద్రీకృతమై దేవుని నుండియు, బైబిలు నుండియు, ఆయన కార్యక్రమమునుండియు మరింత దూరమైపోయినది.

మనము దైవగ్రంథపు పుటలను తిరుగవేసిన యెడల సంఘము యొక్క పని మూడు విధములుగ నున్నదని గమనించగలము : సువార్తను ప్రకటించుట, ఆపదలలో నున్న వారిని ఆదుకొనుట, సంఘ క్షేమాభివృద్ధి కలుగజేయుట, వీటిని ఒక్కొక దానిని ఇప్పుడు గమనించుదము :

1. **సువార్తను ప్రకటించుట :** క్రీస్తు మృతులలో నుండి తిరిగి లేచి పరలోకమున కెక్కిపోకముందు తన శిష్యులకిట్లు బోధించెను : "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకుఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నాను" (మత్తయి 28 : 19,20). "మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును నమ్మని వానికి శిక్ష విధించబడును" (మార్కు 16:15,16). తరువాత యౌవన బోధకుడైన తిమోతిని పౌలు ఇట్లు హెచ్చరించెను: "వాక్యమును ప్రకటించుము; సమయమందును, అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణ దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుము" ( 2 తిమోతి 4:2). ఇంకను అట్టి అనేక వచనములను మనము చూడవచ్చునుగాని ఈపైన చెప్పబడిన వచనముల ద్వారా సువార్తప్రకటన జరుగవలెననెడి దేవుని

అభిలాష మనకు తప్పక వ్యక్తమగుచున్నది.

అపొస్తలుల కాలములో సంఘము ఏమి చేసెను ? ప్రభువు వారిని ఏమి చేయవలెనని కోరెనో దానినే సంఘ సభ్యులు చేసిరి. వారు వాక్యమును ప్రకటించిరి. అపొస్తలుల కార్యములు అను పుస్తకము ఈ ఉదాహరణలతో నిండియున్నది. వాక్యమును బోధించుటద్వారా జనులు మార్పు చెందిన సంధర్భములందున్నవి. అపొస్తలుల కార్యములలో 2,8,9,10,16వ అధ్యాయములను చదువుము. వాక్యమును ఎవరు ప్రకటించి బోధించిరి? యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలిగిన తరువాత "చెదరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారముచేసిరి" యని బైబిలు చెప్పుచున్నది (అపొ.కా. 8 :4).

వారు ఏమి బోధించిరి? ఇది తెలిసికొన వలెననిన అపొస్తలుల కార్యముల గ్రంధములో మార్పు చెందినవారి సంగతిని చదివిన చాలును. అయితే క్లుప్తముగా, వారు క్రీస్తు యొక్క దైవత్వమును బోధించిరి. రక్షణమార్గమును, సంఘం ప్రాముఖ్యతను, ఆరాధనాంశములను, క్రైస్తవ జీవిత ప్రాముఖ్యతను మొదలగువాటిని బోధించిరి. దానినంతటిని పౌలు సంక్షిప్తముగ ఇట్లు నుడివెను : సిలువనుగూర్చిన వార్త నశించుచున్న వారికి వెర్రితనముగాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి (1 కొరింధి 1:18).

తన వాక్యము ప్రకటింపబడవలెనని ప్రభువు ఆజ్ఞాపించుటయేగాక. దేవుని వాక్యమును వినుటద్వారా విశ్వాసము కలుగునని పౌలు చెప్పుచున్నాడు (రోమా 10:17). "మీరు సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులుగా చేయునని" యేసు చెప్పెను (యోహాను 8:32). మరల "వారు విశ్వసింపవానికి ఎట్లు ప్రార్ధన చేయుదురు? విననివానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువాడు లేకుండ వారెట్లు విందురు" (రోమా 10:14). దీని యంతటి భావమేమనగా, మానవుడు నశించిపోచున్నాడు. (రోమా 3:23; 6:23). గనుక దేవుని ప్రేమ ప్రటింపబడవలెను (యోహాను 3:16 మరియు దేవునికి విధేయత చూపు ద్వారా మానవుడు పాపములనుం. రక్షింబడగలడు (రోమా 1:16,17; మార్కు 16:15,16). దేవుని చిత్తము నెవరు ఎరుగరో, ఆయనకు ఎవరు లోబడరో వారందరు నశింతురు (2 థెస్స 1:7,9). అందువలన దేవుని వాక్యము ప్రకటింపబడవలెను.

2. బీదలకు సహాయము చేయుట :

ఆపదలోనున్న వారియెడల సంఘము ఆసక్తి కలిగియుండెనని, అట్టివారికి శక్తికొలది సహాయము చేయుట జరిగెనని మనము దేవుని గ్రంథమందు చూడగలము (అపొ.కా. 2:45). అది ఇట్లు చెప్పుచున్నది: "ఇదియుగాక వారు తమ చరస్థిరాస్థులను అమ్మి, అందరికి వారివారి అక్కరకొలది పంచిపెట్టిరి. అయితే అపొ.కా. 6వ అధ్యాయములో, అనుదిన పరిచర్యలో తమలోని విధవరాండ్రను చిన్న చూపుచూచిరని హెబ్రీయుల మీద గ్రీకుభాష మాట్లాడు యూదులు సణుగసాగినట్లు కన్పడుచున్నది. గనుక అపొస్తలులు శిష్యుల సమూహమును పిలచి సంఘములో ఈ ప్రత్యేక పనికి నియమించబడుటకు నిమిత్తము యేడుగురు మనుష్యులను ఏర్పరచిరి.

యెరూషలేములో నున్న పేద పరిశుద్ధుల పరిచర్యకు పౌలు వెళ్ళినట్లు మనము చదువగలము. "అయితే ఇప్పుడు పరిశుద్ధులకొరకు పరిచర్య చేయుచు యెరూషలేము వెళ్ళుచున్నాను. ఏలయనగా యెరూషలేములో ఉన్న పరిశుద్ధులలో బీదలైన వారి నిమిత్తము మాసిదోనియ వారును, అకయవారును కొంత సొమ్ము చందావేయ నిష్టపడిరి" (రోమా 15: 25,26) అని పౌలు వ్రాసెను: కొరింథులో యున్న సహోదరులకు పౌలు ఇట్లు వ్రాసెను: "పరిశుద్ధుల కొరకైన చందావిషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లినకొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను" (1 కొరింథి 16:1).

ఎవరికి సహాయము చేయవలెను? మొదటిగా సంఘమందు ఆపదలోనున్న వారికి అనగా బీదలు, వృద్ధులు, విధవరాండ్రు, క్రైస్తవ అనాథలు, ప్రమాదములో చిక్కుకొనినవారు మొదలగువారు. "కాబట్టి మనకు సమయము దొరికినకొలది అందరియెడలను, విశేషముగా విశ్వాసగృహమునకు చేరినవారి యెడలను మేలు చేయుదము" (గలతీ 6:10). ఎవరికిబడితే వారికి సహాయము చేయుట యని కాదు. 1 తిమోతి 5వ అధ్యాయములో మనము చూచిన యెడల నిస్సహాయులకు, ఆదుకొను బంధువులు లేనివారికి, నమ్మకమైన క్రైస్తవులని నిరూపించుకొనిన నిరాధారులకు సహాయము చేయవలెనని గమనించగలము. గనుక దేవుని ధనమును జాగ్రత్తగ వినియోగించ వలెను. అడిగినవారి కందరకు పంచి పెట్టుట జరుగకూడదు.

సహాయము సంఘ సభ్యులకు

మాత్రమే కాకుండ, సంఘం స్తోమతనుబట్టి ఆపదలలో నున్నవారికందరికి అంద జేయవలెను. యాకోబు 1:27ను, యాకోబు 2వ అధ్యాయమును చదువుము. ప్రజలకు సువార్తను అందజేయు మార్గము ఇది ఒకటి.

ఇట్టి పనిని చేయుటకు ధనము ఎక్కడనుండి వచ్చును? ప్రోత్సాహము కలిగి కానుకల నిచ్చు సభ్యులనుండి వచ్చును (1 కొరింధి 16:1,2; 2 కొరింధి 9:6,7). అంటే క్రైస్తవులు కానుకల నియ్యనియెడల ఆపదలోనున్న వారికి సహాయము చేయుటకు సంఘమునకు అవకాశముండదు.

3. సంఘం క్షేమాభివృద్ధి కలుగజేయుట: క్షేమాభివృద్ధి యనగా సంఘమును సమకూర్చుట, పటిష్టముచేయుట, ప్రోత్సహించుట, సభ్యులలో ఆత్మీయోద్రేకమును కలుగజేయుట. క్షేమాభివృద్ధిని కలుగజేయున వేమి? దేవుని వాక్యము, సహవాసము,ఆరాధన, పరస్పర సహాయుము, సత్క్రియలు, ప్రేమ మొదలగునవి. అపొ.కా. 9:31; రోమా 14:19; 1 కొరింధి 8:1; 1థెస్స 5:11; 1 కొరింధి 14:26; ఎఫెసీ 4:12లను చదువుము.

ఈ పనులన్నిటిని సంఘము ఖండాంతర ఆర్గనైజేషన్ లేకుండగను, ఒక మానవాధికారి లేకుండగను, ధనమును ప్రత్యేకముగ పోగుచేయుకుండగను ఎట్లు జరిగించగలదు అని అనేకులు అశ్చర్యపడుదురు. అయితే ప్రభువు మార్గము సరియైన మార్గము. ఆయన పనిచేయు మార్గము అది ఒక్కటే. మనము దేవుని చిత్తమును నెరవేర్చుచు, తద్వారా ఈ భూమిపై మన ఉనికిని నిర్వర్తించుచున్న యెడల స్తుతి, మహిమ, ఘనతలు దేవునికే చెల్లును. క్రీస్తు సంఘము వారివారి బాధ్యతలను నెరవేర్చవలెను. సంఘ సభ్యులు వర్థిల్లినకొలది, దేవునికి ఇచ్చుట ద్వారానే సంఘము తన పనిని నిర్వర్తించుట కవకాశముదొరకును.

సువార్తను ప్రకటించుట. సహాయము చేయుట, క్షేమాభివృద్ధి కలుగజేయుట యనునవన్నియును మానవుల ఆత్మలను రక్షించుటకొరకు ఉద్దేశింపబడిన పనులు మాత్రమే. వాటిద్వారా దేవుడే స్తుతింపబడును. సంఘమునకు ఇదిగాక వేరొకపని ఏదియు లేదు. రాజకీయములు, వ్యాపారము మొదలగునవి సంఘమునొక సాంఘిక సంస్థగా మాత్రము తయారుచేయును. అవి దేవునియొద్దనుండి కలిగినవి కావు. క్రీస్తు సంఘము ఒక ఆత్మీయ సంస్థయైయున్నది. అది లోకములో యున్నది కాని లోకసంబంధమైనది

కాదు. దేవునికి లోబడుచు మానవ సేవ చేయుచు, నభ్యులందరి ఆత్మల రక్షణార్ధము పవిత్రముగను, పరిశుద్ధముగను ఉండి దాని సృష్టికర్తకు మహిమను తెచ్చుటయే దాని బాధ్యత. ఇదియే క్రీస్తు సంఘము, ఇదియే దాని కృషి ఇదియే దాని కర్తవ్యము.

– జె.సి. ఛోట్

ప్రకటనన గ్రంధ ప్రసంగ మాలిక – 14

# మారుమనస్సు పొందాలని దేవుని హెచ్చరికలు

## (God's warnings to Repent)

**ఉపోద్ఘాతము:**
ప్రకటన మొదటి అధ్యాయములో సంఘముల మధ్య సంచరించుచున్న యేసు ప్రభువును చూస్తాము. రెండు మూడు అధ్యాయాల్లో తమ సాధక బాధకాల్లో యున్న ఏడు సంఘములను చూస్తాము. వాటి విజయాలను కూడ గమనిస్తాము. నేడు నాడు సంఘము పాపముపై సాతానునిపై పోరాటము సల్పుచున్నట్లు గ్రహించగలము.

నాలుగవ అధ్యాయంలో పరలోకములో దేవుని సింహాసనమును చూస్తాము. ఈ లోకం అంతా దేవుని కంట్రోలులో యున్నది. గనుక దేవుని ప్రజలు విజేయులవుతారు, అంతిమ విజయం వారిదే. 5వ అధ్యాయంలో ఈ లోక పాపముల నిమిత్తము వధింపబడిన గొర్రెపిల్ల సింహాసనాసీనుడై దేవుని కుడి పార్శ్వమున కూర్చుండుట చూస్తాము. తండ్రితో సమానముగా ఆయన కూడ ఆరాధింపబడుట చూడగలము. 6వ అధ్యాయములో దేవుని గొర్రెపిల్ల జయించుచు జయించుటకు వెళ్లుట గమనిస్తాము.

ఆయన తన ప్రజల ద్వారా ప్రపంచమందున్న ప్రజలందరి మనస్సులను సువార్త ద్వారా జయించుటకు మొదలిడ్డారు. తత్ఫలితముగా సాతానుడు దేవుని క్రియలను నాశనంచేయుటకు ప్రయత్నిస్తాడు. లోకమంతా సువార్తచాటబడుచుండగా దేవుని ప్రజలను సాతానుడు నాశనం చేయుటకు శతవిధాల ప్రయత్నిస్తాడు.

మతపరమైన హింస, ఆర్ధిక ఇబ్బందులు మొదలైనవి దేవుని ప్రజలకు సంభవిస్తాయని ఆయా ముద్రలు

విప్పబడుచుండగా గ్రహించాము. వారు అన్యాయానికి, మరణానికి గురియవుతారు. మరణం విశ్వాసికీ, అవిశ్వాసికీ సంభవిస్తాది. గాని మరణం దేవుని ప్రజలకు హానిచేయదు ఏలయనగా వారు దేవుని సన్నిధానమునకు చేరుకొంటారు.

చివరిగా మానవ జాతిపై దేవుడు చేయు వినాశకరమైన తీర్పులను మనం 7వ అధ్యాయములో కొంతచూచియుంటిమి. దేవుడు తనసొత్తుగా ముద్రవేసిన ప్రజలకు దుర్మార్గులకు జరిగిన నాశనం సంభవించదు. దేవుని ప్రజలు ఆయన సింహాసనము యెదుట నిత్యము సంతోషమను భవిస్తారు.

8వ అధ్యాయములో బూరలు ఊదుచున్న (హెచ్చరికలు చేయుచున్న) ఏడుగురు దూతలను చూస్తాము. యిది దేవుని ప్రజలకు హాని చేయు వారికి దేవుడు చేయు హెచ్చరికలు. 8వ అధ్యాయములో నాలుగు బూరలు ఊదబడుట, తత్ఫలితముగా సంభవించిన విపత్తులను గమనించాము.

## I. అయిదవ బూర (ప్రకట 9:1-11)

A. "అయిదవ బూర ఊదినప్పుడు ఆకాశమునుండి భూమి మీద రాలిన యొక నక్షత్రమును" యోహాను చూచెను. "అగాధము యొక్క తాళపు చెవి అతనికి ఇయ్యబడెను"

1. నక్షత్రము ఒక గురుతు మాత్రమే. ఆ నక్షత్రము ఒక వ్యక్తియని మనకు గ్రాహ్యమగుచున్నది. ఆ వ్యక్తి యెవరు?
2. లూకా 10:18లో యేసు "సాతాను మెరుపువలె ఆకాశమునుండి పడుట చూచితిని " అని చెప్పెను. యెషయా 14:12; 2 పేతురు 2:4;
ప్రకటన 12:9-11. యూదా : 6 కూడచూడుము. అగాధము యొక్క తాళపు చెవి అతనికి ఇయ్యబడెను. అతనికి స్వతహాగా అధికారము లేదు గాని కొంతమట్టుకు శక్తి ఇయ్యబడెను. సాతాను యొక్క శక్తి పరిమితి గలది మాత్రమే. అతడు కొంతమట్టుకు మాత్రమే పనిచేయగలడు. ఒకప్పుడు మరణము యొక్క బలముగలవాడతడు (హెబ్రీ 2:14). గాని మరణపునరుత్థానముల ద్వారా మరణము యొక్కయు, పాతాళము యొక్కయు తాళపు చెవులు ఇప్పుడు క్రీస్తు స్వాధీనములోయున్నవి (ప్రక 1:17,18). ఆయన సర్వాధికారి (మత్తయి 28: 18).

B. అతడు అగాధము తెరవగా గొప్ప పొగచేత సూర్యుని,వాయుమండల మున చీకటి కమ్మెను (2వ).
సాతానుడు ప్రజలలో కలుగజేయు ఆత్మీయ అంధకారమునకు యిది గురుతు. "దేవుని స్వరూపియై యున్న క్రీస్తు మహిమ కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు

నిమిత్తము ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనో నేత్రములకు గ్రుడ్డి తనము కలుగజేసెను" అని పౌలు చెప్పెను (2 కొరింథీ 4:4). వారు దేవుని దేవునిగా ఎరుగలేదు మహిమ పరచలేదు. "వారి అవివేక హృదయము అంధకారమయమాయెను (రోమా 1:21).

C. ఆపొగలోనుండి తేళ్లకున్న బలముగల మిడతలు భూమి మీదకు వచ్చెను. దేవుని ముద్రవేయబడిన వారికి అవి యేహానియు చేయ కూడదని ఆజ్ఞ ఇయ్యబడెను. దేవుడు తన వారిని ముద్రవేసి సంరక్షించును. గొర్రెపిల్ల రక్తముచే వారు ముద్రవేయబడిన వారు . ఐగుప్తులో తన వారిని ఆయన యిట్లే మరణ దూతనుండి రక్షించెను. ఈ మిడతలు మనుష్యులకే గాని వృక్షములకు హానిచేయ కూడదు.

D. తేళ్ల వంటి ఈ మిడతల వలన కలుగు బాధ తేలు మనష్యుని కుట్టి నప్పుడుండు బాధవలె నుండును (5వ). వాటి భయంకర వికృతా కారము 7-10 వచనాల్లో వర్ణించబడెను. యిది అలంకార రూపకమైన మిడతలే గాని నిజమైనవి కావు.

1.యివి అసాధారణమైన మిడతలు, నిజమైన మిడతలు గడ్డిని, వృక్షముల ఆకులను తినును, గాని యివి వాటికి హాని చేయ కూడదని చెప్పబడెను. మనుష్యులను బాధించుటకే గాని వారిని చంపుటకు వాటికి అధికారము లేదు.

2. అవి మనుష్యులను ఏరీతిగ బాధపెట్టును ? పాపములో మునిగిన వారిని అవిబాధపెట్టును. యోవేలు మొదటి అధ్యాయములో మిడతల వలన సంభవించు నాశనము వర్ణించబడినది. పూర్వ కాలము మిడతల దండు ఒక భయంకర దృశ్యము. నేటికిని కొన్ని ప్రాంతాలలో అవి కలిగించు నాశనము, బాధ అంతాయింతాకాదు. మిడతల ద్వారా. దేవుని తీర్పును యోవేలు 1:1-12లో మనం చూడగలము. అవి ద్రాక్షాచెట్లనుపాడు చేసెను, పొలము పాడుచేసెను, భూమి అంగలార్చు చుండెను, ధాన్యము నశించెను, క్రొత్త ద్రాక్షారసము లేకపోయెను, తైల వృక్షము వాడిపోయెను, పైరు చెడిపోయెను, అంజూరపు చెట్లు వాడిపోయెను,"దానిమ్మ చెట్లును ఈత చెట్లును జల్దరు చెట్లును తోట చెట్లన్నియు వాడిపోయెను, నరులకు సంతోష మేమియు లేకపోయెను".

3. తేళ్ల వంటి ఈ మిడతల సూచన యేమిటి? మనుష్యులలో నుండి సంతోషము బొత్తిగా తీసివేయబడెను. దేవునిపై తిరుగు బాటు చేసినవారి జీవితములు బాధతోను,రోదనతోను నిండియుండును. "అట్టివారు మరణమును వెదుకుదురు గాని అది

దొరకదు. చావవలెనని ఆశపడదురు గాని మరణము వారి యొద్దనుండి పారిపోవును (6వ). ఈ మిడతల వలన బాధపొందువారు దేవుని ప్రజలు కాదని గమనించుము. వారు పూర్తిగా కాపాడబడియుందురు. దేవుని సంతోషము వారి హృదయములలో యుండును. దేవుడు తన వారిని ఎరుగును (2 తిమోతి 2:19).

E. 7-10 వచనాల్లో ఆ మిడతలను గూర్చి 7.8. రకాల వర్ణన ఈయబడెను. యిది పావము యొక్క భయంకరరూపము. దానిలో పడిన వారి బాధ వర్ణనాతీతము.

F. "అయిదు నెలలవరకు మనుష్యులకు హానిచేయుటకు వాటికి అధికారముండెను" (10వ). ఈ అయిదు నెలల సంగతి యేమిటి? యేమిలేదు. అయిదుగురు బుద్ధి గల కన్యకలు, 5 గురు బుద్ధిలేని కన్యకల ఉపమానములో అయిదుగురే ఎందుకున్నారు? దానికి పెద్దగా భావార్థము చెప్పనక్కర్లేదు. మరల ప్రభువు వారు 5 తలాంతులను గూర్చిన సంగతిచెప్పారు. అయిదే ఎందుకు? 12 ఎందుకు. కాలేదు? లేదా 10 లేదా 9?

G. పాతాళపు దూత వాటిపైన రాజుగా ఉన్నాడు, హెబ్రీ భాషలో వాని పేరు అబద్దోను, గ్రీకు భాషలో అపొల్లో యోను (11వ).

ఈ మాటకు నాశనము చేయువాడు, నాశనము అనియర్థము. సాతానుని పరిపూర్ణ వర్ణన యిది. మనుష్యులను నాశనము చేయువాడు అతడే. అతడు వారిని మోసగించి నాశనం చేయును. ఈ వచనాల్లో మానవుల ఆత్మలను వేధించు ఆత్మీయనైతిక పతనము వర్ణించబడినది. పాపము ముల్లువలె గుచ్చును. మరణపుముల్లు పాపము ( 1 కొరింథీ 15:56). పాపపు విషము మనుష్యుల ఆత్మలకు ఎక్కించబడినప్పుడు అది గుచ్చును. బాధించును సాతానుడు దానియంతటికి రాజైయున్నాడు.

## II. ఆరవ బూర (9:12-21)

"మొదటి శ్రమ గతించెను ; ఇదిగో మరిరెండు శ్రమలు ఇటు తరువాత వచ్చును" (12వ).

ఈ రెండు శ్రమలలో ఒక దానిని గూర్చి ఇక్కడ చెప్పబడెను. "ఆరవ దూత బూర ఊదినప్పుడు దేవుని యెదుట ఉన్న సువర్ణ బలిపీఠము యొక్క కొమ్ముల నుండి యొక స్వరము - యూఫ్రటీసు అనుమహానది యొద్ద బంధింపబడిన నలుగురు దూతలను వదలిపెట్టుమని బూర పట్టుకొనియున్న ఆయారవ దూతతో చెప్పుట" యోహాను వినెను (14వ). మొదటి శతాబ్దపు క్రైస్తవులకు యూఫ్రటీసు నదిని గూర్చిబాగుగా తెలును. ఇశ్రాయేలీయులకు తూర్పుననున్న శత్రువులకు అడ్డుగా యూఫ్రటీసు నదియున్నది. దేవుని ప్రజలు శత్రువులు అష్షూరు దేశస్థులు,

సిరియనులు జబులోనీయులు. (యెషయా 7:20; 8:7-8; 1రాజులు 14:15 చూడుము).

16-19 వచనాల్లో మనుష్యులకు సంభవించు శ్రమవర్ణించబడెను. అది పాపులైన మానవులపై దేవుని తీర్పు, ఈ శ్రమలో బాధింపబడు వారు దేవుని ప్రజలుకారని గమనించాలి. బాధనొందువారు అవిశ్వాసులు. దేవుని ప్రజలను తిరస్కరించి వారిని హింసించినవారు. 8వ అధ్యాయములోని మొదటి 5బూరలు దేవుని సింహాసనము ఎదుట ఆయన ప్రజలు చేసిన ప్రార్థనలకు ప్రతిఫలము. దేవుని ప్రజలను హింసించువారిపైకి అగ్నికురిపించబడెను.

13వ వచనములో ఆరవ దూత బూర ఊదినప్పుడు మరల దేవుని బలిపీఠము పరిచయం చేయబడింది. యూఫ్రటీసు దగ్గర బంధింపబడిన నలుగురు దూతలను వదిలి పెట్టుమని ఒక స్వరం చెప్పెను. దేవుడు ఏర్పాటుచేసిన సమయమందు ఆయనపై తిరుగుబాటు చేసిన వారిపైకి నాశనము తెచ్చునట్లు ఆయన సాతానుకు అనుమతినిచ్చును. ఈ శ్రమలో మనుష్యులలో మూడవ భాగముచంపబడెను. అంటే యిది దేవుని అంతిమ తీర్పుకాదని తెలియజేయుచున్నది. భూమిపై యుద్ధము వెంబడి యుద్ధము జరుగుచుండగా యివి మానవులకు దేవుని తీర్పును సూచించుచున్నది.

అయినను మనుష్యులు మారుమనస్సు నొందలేదు. శిక్షింపబడగా కొందరు మార్పుచెందుతారు.

"ఈ దెబ్బల చేత చావక మిగిలిన జనులు దయ్యములను .......విగ్రహములను విడిచి పెట్టునట్లు మారుమనస్సుపొందలేదు. మరియు తాము చేయుచున్న నరహత్యలునూ మాయమంత్రములును జార చోరత్వములును చేయకుండునట్లు వారు మారుమనస్సు పొందిన వారుకారు" (20-21వ)

**ముగింపు :**

నిన్ను నీవు దేవునికి అర్పించుకో ఆయన నిన్ను ప్రేమించుచున్నాడు, నీ కొరకు చింతించుచున్నాడు. మనుష్యులు తాము చేయుచున్న ఘోర కృత్యములను గూర్చి మారుమనస్సుపొందాలి. ఆయన తీర్పులు బయలువెళ్లుచునేయున్నాయి. అయినను కొందరు తమ హృదయ కాఠిన్యము వలన మారుమనస్సుపొందరు. దేవునివైపు తిరుగరు. ఆయన వారికి హెచ్చరికలు జారీచేస్తునేయున్నారు. ఇంక సమయముండ గానే మారుమనస్సు పొందాలి సాతానుడు నాశనంచేయును. అతడు మానవుని మిత్రుడు కానే కాదు. వినాశం చేసే బద్ధశత్రువు !

బైబిలు సర్వే -1

# భూమ్యాకాశముల ప్రభువైవ యెహోవా

మానవులు అనేకమంది అన్ని కాలములందు దేవునిని తెలిసికొనుటకు ప్రయత్నం చేశారు. వారి ప్రయత్నములలో దేవునిని వారి స్వంత ఉద్దేశ్యానుసారంగా రూపొందించుకున్నారు. కొంతమంది ఒకే దేవుడన్నారు, మరికొందరు చాలామంది అన్నారు. ఈ ప్రశ్నలోని యదార్థత ఏమి?

బైబిలు గ్రంథమునందు ఒకే దేవునిని గూర్చి మనము చదువగలము. ఆయన నిత్యుడు, సర్వమును సృష్టించి వాటి ధర్మములను జరిగేటట్లు చూచున్నాడు. ఆయనే ఈ సృష్టినంతటిని ఒక రోజున లయము చేసి ప్రతీవారికి తీర్పు తీర్చును. మనము బైబిలులో మానవుడు తన స్వంత ఊహలను బట్టి సృష్టించుకొనిన విగ్రహములను అబద్ధ దేవుళ్ళను గూర్చి కూడా చదువగలము. బైబిలు నుండి ఈ దిగువ లేఖనములను పరిశీలించుదము. యెషయా 44:6-17; యెషయా 40:12-31. మానవుల మేధస్సులో ఏ విషయముల గురించి ఇష్టపడి ఆరాధించుచున్నారో, వాటిని దేవుళ్ళుగా పరిగణించుచున్నారు. కానీ ప్రభువు శిష్యులకు ఒకేఒక్క దేవుడు. 1 కొరింధి 8:4-6 చదువుము. యేసుక్రీస్తు ఈ లోకములోనికి వచ్చి ఒకేఒక్క నిజమైన సత్యదేవునిని చూపించి, ఆయననే ఆరాధించాలని ప్రజలందరికి బోధించారు. పౌలు. అనేక మంది దేవుళ్ళను ఆరాధించే వారికి చెప్పిన సందేశమును అపొస్తలులు కార్యములు 17:16-31 వరకు చదివిన గ్రహించగలరు. జీవమునకు, వెలుగుకు, నీళ్ళకు వివిధములగు దేవుళ్ళుండరు సృష్టినంతనిటి దేవుడు సృజించాడు. కాబట్టి సృష్టియంతటికి ఒకేఒక్క దేవుడున్నాడని బైబిలు చెప్పుచున్నది. ఈ క్రింది వాక్యభాగములను పరిశీలించుము.

ఆదికాండము 1:1-31

అపొస్తలులు కార్యములు 17:24-29.

దేవుడు తనను గురించియు దేవుళ్ళుకాని దేవుళ్ళను గూర్చియు చెప్పిన వాక్యభాగములను గూర్చి పరిశీలించుము. యెషయా 44:6, యెషయా 45: 5, 20-25 వరకు

ఈ నిజదేవుడైన యెహోవా, వేరొక దేవునిని ఆరాధించి, సేవించు వానిని నాశనము చేయుదునని చెప్పుచున్నాడు. ఆయనే నిజమైన దేవుడు, రక్షకుడనని

ఆయనకు తెలుసు కాబట్టి రోషముతో ఈలాగు చెప్పుచున్నాడు. ఈ క్రింది వాక్యభాగములను పరిశీలించుము యెషయా 43:11.ద్వితీయోపదేశ కాండము 5:6,10

అపొస్తలుడైన పౌలు చెప్పినట్లు, జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ప్రభువైయున్నందున హస్తకృతములైన ఆలయములలో నివసింపడు. కాబట్టి ఆయనను వెండి, బంగారములతో మల్చబడిన వానినిగా భావించ కూడదు. కనుకనే యేసుక్రీస్తు యోహాను 4:24లో దేవుడు ఆత్మ అని చెప్పెను. బైబిలునందు యోహాను తన పత్రికలలో దేవుడు ప్రేమ స్వరూపియై యున్నాడు అని చెప్పెను. 1 యోహాను 4:8-1 ఎప్పుడు మనం దేవుడు భౌతికమైనవాడు కాదు, ఆత్మస్వరూపి అని గ్రహించగలమో అప్పుడు దేవునిని వెదకువారి సమస్యలు గ్రహించగలము. దేవుని వెదికే ప్రయత్నంలో దేవుడు భౌతికమైన రూపములలో ఉంటాడని ఊహించి సూర్యుడు, ఎద్లు, ఏనుగులు, కోతులు మరియు మనుష్యులు రూపంలో ఉంటాడని ఊహించారు కానీ దేవుడు భౌతిక స్వరూపి మాత్రం కాదు. మనం దేవునిని నిజంగా అర్థంచేసుకోవాలంటే, ఆయన ఎలాంటి వాడో తనంతట తానే బడలువర్చు కోవాలి. ఆయన ప్రేమాస్వరూపి గనుక ఆయనే మనకు దానిని చూపించాలి. క్రీస్తును మనకు ప్రత్యక్ష పరచుట ద్వారా ప్రేమ అనునది మనం అర్థం చేసుకొను నట్లు దేవుడు చేసెను. కనికరము దయాళుత్వం దేవుని ఆత్మీయమైన గుణములు కాబట్టి తానే క్రీస్తునందు బయలు పరచెను. దేవునికి మానవుని హృదయాంతరాలు తెలుసు. గనుక క్రీస్తు ద్వారా దానిని మనకు తెలియపర్చారు. జీవము, మరణములపై దేవునికి అధికారము కలదు గనుక దానిని మనకు క్రీస్తునందు బయలుపర్చారు.

దేవుడు శరీధారియై యేసుక్రీస్తువలె భూమి మీదకు వచ్చెను. దేవుడు ఏమై యున్నాడో తెలియపర్చుటకు ఆయన వచ్చెను. క్రీస్తు జీవితము ద్వారా దేవుని యొక్క గుణమును మనకు చూపించారు. ఏలయనగా దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది. కొలస్స 2:9. క్రీస్తు తుఫానును గద్దించి నిమ్మళ పరచినపుడు, దేవుని యొక్క స్వభావమును, ప్రకృతిపై ఆయనకున్న శక్తిని మనం చూడగలము. అద్భుతరీతిగా 5000 మందికి ఆహారమును సృష్టించగలిగిన శక్తిని బట్టి దేవుని దైవత్వమును మనము చూడగలుగుచున్నాము. పాపులకు యేసుక్రీస్తు ఆహారమును సృష్టించగలిగిన శక్తిని బట్టి దేవుని దైవత్వమును మనము

చూడగలుగుచున్నాము . పాపులతో యేసుక్రీస్తు ఆహారము భుజించినపుడు పాపులయెడల ఆయనకు గల శ్రద్ధను మనం తెలుసుకొనగలం. చనిపోయి 3 రోజులు సమాధిలో ఉంచబడిన లాజరును తిరిగి బ్రతికించుట ద్వారా ఆయన జీవాధిపతి యని మనం తెలుసుకొనగలుగుచున్నాము. క్రీస్తు బోధలు, చేసిన అద్భుతములు మనము చదువుట ద్వారా ఆకాశమునకును. భూమికిని తండ్రియైన దేవుని ఆత్మీయగుణములను మనము చూడగలుగుచున్నాము. దేవుడు మానవుల ఎడల శ్రద్ధ కలిగి వారిని రక్షణ పొందునట్లుగా ఆయననే సేవించాలని కోరుచున్నాడు. అలాగు చేయుట ద్వారా దేవుని గుణములను మానవుడు సంతరించుకోవాలని దేవుడు కోరుచున్నారు. ఈ క్రింది వచనములను పరిశీలించుము. యోహాను 1:1-5; 14-18; హెబ్రీ 1:1-4; 2 కొరింథీ 4:5-6. యోహాను 14:7-11, మనము క్రీస్తును చూచినట్లయితే తండ్రిని చూచినట్లే. థెస్సలోకీనీకయులు క్రీస్తును గురించి వినినప్పుడు విగ్రహారాధన విడిచిపెట్టి జీవముగల సత్యదేవునిని ఆరాధించుటకును, త్వరలో రానైన ప్రభువు కొరకును కనిపెట్టుట మొదలు పెట్టిరి. మనమందరము వీరివలె ప్రభువు తట్టు తిరుగవలెను. 1థెస్సలోనికయులు 1:9-10 వరకు చదువుము.

## ప్రశ్నలు :

1. లోకములో నిజమైన దేవుళ్ళు ఎంత మంది ఉన్నారు...? (యెషయా 45:5).

2. నిజదేవునిని ఏలాగు గుర్తించగలము ?

3. బైబిలునందలి నిజదేవుడైన యెహోవాను ఆరాధించుచు వేరొక దేవుని ఆరాధించుట అంగీకారమా ? (ద్వితీయోపదేశ కాండము 5:6-10 అపొస్తలుల కార్యములు 17:29-31)

4. దేవుడు : 1. ఆత్మ 2. కర్రబొమ్మ 3. చిన్నగుడిలో తాళము వేయబడినవాడు 4. అనేక మంది దేవుళ్ళలో ఒకడు-యోహాను 4:24 ఇందులో ఏదిరైటు ?

5. సమస్తము సృష్టించిన వాడెవరు ? (ఆదికాండము-1).

6. దేవునిని బయలుపరచిన వారెవరు ? 2 కొరింథీ 4:6.

7. నీవు కోరిన ఏదేవుడైన నిన్ను రక్షించగలడా ? యెషయా 43 అవునా-కాదా ?

8. యేసుక్రీస్తు సువార్త ప్రజలు వినినప్పుడు, అంతకుముందు వారు ఆరాధించు విగ్రహములను ఏమి చేయాలి ? (1 థెస్సలోని 1:9-20, అపొస్త 17:20-29)

9. సరియైన జవాబును గుర్తించుము. విగ్రహములు ఎ. జీవముగల దేవుళ్ళు బి. మానవ హస్త

నిర్మితములు

10. సూర్య చంద్రులను సృజించిన దేవుడు మానవుని కూడా సృజించెను. అవునా-కాదా ఆది: 1.

11. చేపలను సృజించిన దేవుడు జంతువులను, పక్షులను కూడా సృజించెను. ఆది: 1 అవును-కాదు

12. ఒక దేవుడు సృష్టికర్త. మరియొక దేవుడు పరిపాలకుడు అవును-కాదు.

13. దేవుడు నివసించుటకు సరిపోవు కట్టడమును మానవుడు కట్టగలడా? అపొస్త :17-24 అవును-కాదు

14. యేసు చెప్పెను "మీరు నన్ను చూచినఎడల---------- చూచినట్లే యోహాను 14:9

15. క్రీస్తు శిష్యులు ఎంతమంది దేవుళ్ళను నమ్మారు ? 1 కొరింధీ 8:4-6.

16. దేవుని స్వరూపమును మనకు చూపిన వారెవరు ? ఎ. యేసు బి. మానవులు

17. యేసుక్రీస్తు కేవలము అద్భుతకార్యములు చేయుటచు దేవుని యొక్క గుణమును బయలుపరచెను? అవును-కాదు.

18. జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ------------ అయినందున హస్తకృతములైన ఆలయములలో నివసింపడు అపొస్త 17:24

19. ముఖ్యగమనిక :- దేవుడు అదృశ్యుడు కానీ ఆయన అదృశ్య లక్షణములు ----------- ఆలోచించుటవలన తేట తెల్లముగా బయలుపడుచున్నవి. అందువలన వారు నిరుత్తరులై యున్నారు.

**సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీయింటిలోనే పూర్తిచేసి బైబిలు జ్ఞానమును పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.**

SATYAVANI, P.O.Box-80 KAKINADA - 533 001.

**గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపిచవలయును.**

# దేవుడు అసహ్యించుకొనును.....
## (God Hates ....)

మనము దేవుని ప్రేమను గూర్చి, కృపను గూర్చి లేక దయను గూర్చి తరుచు వినుచుందుము గాని దేవుడు అసహ్యించుకొనునను సంగతిని బహు అరుదుగా విందుము. గాని దేవుడు అసహ్యించుకొనును.

"యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు, ఏడును ఆయనకు హేయములు. అవేవనగా, అహంకార దృష్టియు, కల్లలాడు నాలుకయు, నిరపరాధులను చంపు చేతులును, దుర్యోచనలు యోచించు హృదయమును, కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును, లేనివాటిని పలుకు అబద్ధసాక్షియు, అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడును" (సామె 6:16-19).

దేవుడు పవిత్రుడు, పరిశుద్ధుడు, నీతిమంతుడు గనుక ఆయన అబద్ధములను అబద్ధములాడుటను వ్యతిరేకించును, ద్వేషించును. మనము కుటుంబ సభ్యులతోను, పనిచేయువారితోను లేదా మరెవరితోను కూడ అబద్ధ మాడినప్పుడు దేవుడు అసహ్యించుకొనును. మనము దేవునితోను, మనకుగా మనతోను అబద్ధములాడుటను దేవుడు అసహ్యించుకొనును.

అబద్ధమాడుట మంచిదికాదని మనందరికి తెలియును, అయితే కొన్నిసార్లు మన ఉద్దేశములు వేరుగా ఉన్నను వాటికి భిన్నమైన వాటిని చెప్పుచుందుము. మన మాలాగు చేసినప్పుడు నేరుగా మనము అబద్ధ మాడకపోయినను. మనము చెప్పినవారి హృదయములో వేరే అభిప్రాయమును కలుగజేతుము. వారిని మోసగింతుము. ప్రజలను మోసగించుట పాపము (రోమా 1:23-32 చదువుము).

దేవుడు అబద్ధమును అసహ్యించుకొనును. అబద్ధమును నీవు కూడ ద్వేషించవలెను. అబద్ధములు అబద్ధము లాడుటవలన ఒకడు నశించును. "పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధకులును అబద్ధికులందరును అగ్నిగంధకములతో మండు గుండములోపాలు పొందుదురు; ఇది రెండవ మరణము" (ప్రకటన 21:8). అబద్ధముల వలన ఒకడు పరలోకము చేరలేకపోవును. "గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథమందు వ్రాయబడినవారే దానిలో ప్రవేశింతురు గాని నిషిద్ధమైన దేదైనను అసహ్యమైన దానిని అబద్ధమైన దానిని జరిగించువాడై

నను దానిలోనికి ప్రవేశింపనే ప్రవేశింపదు" (ప్రకటన 21:27).

అబద్ధమును దేవుడు ఎందుకు అసహ్యించుకొనును ? అబద్ధములు చెప్పుట పాపము. అవి మనలను పాపము నుండి దూరము చేయలేవు. మనము ఎల్లప్పుడు సత్యమునే చెప్పుచు. సత్యమును ప్రేమించవలెను. దేవుని వాక్యమందున్న సత్యము మాత్రమే మనలను పాపము నుండి రక్షించగలదు. యేసు ఇట్లనెను : "మీరు నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:31).

- మార్క్ బర్డ్


వోయిస్ ఆఫ్ ట్రూత్

**Vol 1-10**

ఇప్పుడు లభ్యముగుచున్నది.

**ఇక మీదట వోయిస్ ఆఫ్ట్రూత్ మేగజైన్ కావలసిన వారు 5/- రూ॥ల పోస్టేజీ స్టాంపు తప్పనిసరిగా పంపించవలెను.**

**ఆ మేగజైను ఉచితమే గాని పోస్టుఖర్చులు మేము భరించవీలుపడదు. దిగువ అడ్రసుకు వ్రాయండి :**

**SATYA VANI**

**P.o Box. 80**

**Kakinada - 533 001, A.P.**

వి. సుదర్శనరావ్‌గారి పర్యవేక్షణలో కూటము సమర్ధవంతముగా నిర్వహించబడెను.

ఆగష్టు 23వ తేదీ గురువారం కిర్లంపూడి మండలం వేలంకలో జరిగిన సువార్త కూటములో రిక్కీ గూటంగారు వాక్యపరిచర్య చేసిరి. ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అక్కడ రాజబాబుగారు సువార్తచాటుచున్నారు. ఆయన విరవలోను కూడ సువార్తచాటు మతశాఖల నుండి క్రీస్తు సత్యములోనికి ఆకర్షింపబడుచున్నారు.

ఆగష్టు 27వ తేదీ సాయంత్రం విశాఖ జిల్లా కొలిమేరు. దేవవరం ప్రాంతములలో జరిగిన సువార్త కూటములో రిక్కీ గూటంగారు వాక్య పరిచర్య చేసిరి. అక్కడ గోగాద యోహానుగారు వాక్యపరిచర్యచేయుచున్నారు. ఆ మరునాడు (28వ తేదీ) పిఠాపురం మండలం జగ్గయ్య చెరువులో ఏర్పాటు చేయబడిన సువార్తకూటములో రిక్కీ గూటంగారు వాక్యపరిచర్య చేసిరి. జగ్గయ్య చెరువులోను, యానాది కోలనీలోను, ఉప్పాడలోను సోదరులు పెబ్బిలి సత్యానందంగారు సువార్త చాటుచున్నారు.

2007 ఆగష్టు 17వ తేదీ శుక్రవారం ఉదయం సోదరులు పులగల ప్రకాశంగారు హైదరాబాదులో ప్రభువునందు నిద్రించిరి. ఆమరునాడు హైదరాబాదులోనే ఆయన కుమారుడు Bro. విలియం కేరీగారి (Asst. కమీషనర్ ఆఫ్ పోలీస్) ఆధ్వర్యమున అంత్యక్రియలుగావించబడెను. 19వ తేదీనాడు హైదరాబాదులో ఒకస్మారక కూటము ఏర్పాటుచేయబడెను.

ఆగష్టు 27వ తేదీ సోమవారం సోదరులు పులగల ప్రకాశంగారు క్రీస్తు కొరకు ఎక్కువకాలం శ్రమించిన జగన్నాధగిరి గ్రామంలో సంస్మరణ సభ జరిగించబడెను. ఆ సభకు పలు సంఘాల నాయకులు, పెద్దలు, బంధువులు మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరైరి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమంత్రివర్యులు గౌరవనీయులు గొల్లపల్లి సూర్యారావ్‌గారు కూడ హాజరై ప్రకాశంగారితోను ఆయన కుటుంబముతోను ఆయనకు గల

స్మృతులను జ్ఞాపకం చేసి ప్రకాశంగారి వలెనే మంచిమాదిరికరమైన జీవితం జీవించాలని ప్రబోధించిరి. నాటి సభకు సోదరులు జాషువా గూటంగారు అధ్యక్షత వహించి గౌరవప్రదంగా నిర్వహిస్తు ప్రకాశంగారికి నివాళులు అర్పించిరి. ఆ సంస్మరణ సభలో మిత్రులు వసంతరావ్‌గారు. సోదరులు K.G. కుమార్, యమ్. సామ్యేలు రాజు, S. సామ్యేలుగార్లు తదితరులు ప్రకాశంగారితో తమకుగల పరిచయాన్ని వివరిస్తు దేవుని వాక్యము నుండి హెచ్చరికల నిస్తు ఆదరణ కలిగించిరి. ఆనాటి స్మారక సభ ప్రభాకర్ రాజమౌళిగారి ప్రార్ధనతో ఆరంభమై టి.వి.యన్. కుమార్‌గారి ప్రార్ధనతో అంతమాయెను. ప్రకాశంగారి కుమారుడు విలియం కేరీగారు వందన సమర్పణ చేసిరి. తదుపరి విందు ఏర్పాటుచేయబడెతను.

సోదరులు: పులగల ప్రకాశంగారు విడిచి వెళ్లిన సతీమణిగారికి, కుమారుడు, కోడలు,ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు, మనుమలు, మునిమనుమలకు ఆదరణ కలిగించాలని ప్రార్థించమనవి.

*RNI Regd. No. 6997/98*
*Postal Regd. No. AP/KD-02/2006-2008*

*To*

From:

**SATYA VAKKU**

***P.O. Box 80, Kakinada - 533 001***

[illegible] by Joshua Gootam Printed & published Satya Vani Publication, Sambhamurthy St, Kakinada [illegible]